Follow: @ANNTELUGU


17-01-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 22 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## గగనతలంలో మంత్రి జూపల్లి విహారం

### హైదరాబాద్‌లో హాట్ బెలూన్ ఫెస్టివల్

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ అందాలను గగనతలం నుంచి వీక్షించే అద్భుత అవకాశం ఇపుడు నగర ప్రజల ముందుకొచ్చింది. తెలంగాణలో పర్యాటక రంగానికి కొత్త ఊపునిచ్చేలా హాట్ ఎయిర్‌బెలూన్ ఫెస్టివల్ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. గోల్కొండ కోట సమీపంలోని గోల్కొండ గోల్ఫ్ క్లబ్ పరిసరాల్లో ఈ ఫెస్ట్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో గంటన్నర పాటు ప్రయాణించి నగర అందాలను గగనతలం నుంచి తిలకించారు. గోల్కొండ గోల్ఫ్ క్లబ్ నుంచి మొదలైన మంత్రి జూపల్లి ప్రయాణం 13 కిలోమీటర్ల దూరంలో అప్పాజీగూడ శివారులో ముగిసింది. అనంతరం.. మంత్రి మీడియాతో మాట్లాడుతూ హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణం చిరస్మరణీయమని అన్నారు. ఈ ఫెస్ట్‌తో తెలంగాణ పర్యాటక రంగ చరిత్రలో ఓ కొత్త అధ్యాయం మొదలైందని అన్నారు. తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. పర్యాటకులకు కొత్త అనుభూతులను ఇచ్చే ఐడియాల అమలుకూ తాము సిద్ధమని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి కోసం సంప్రదాయం, సృజనాత్మకతను మేళవిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.

టాప్ న్యూస్



### అవును.. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉంది

- ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు
- టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చిన నిజామాబాద్ ఎంపీ


02



### ట్రోలర్స్‌కు అనసూయ షాక్

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు
- ఆన్‌లైన్‌లో వేధింపులు, అసభ్య ప్రచారంపై కంప్లైంట్
- 42 మందిపై కేసు నమోదు

02



### మూడు రోజులుగా అన్నం తినలేదు

- బావిలో దూకమన్నా సిద్ధం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మద్ధతుగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలు

02



### భీమవరంలో బంగారు పులిగోరు నగల కోడిపుంజు

**భీమవరం:** భీమవరం దుర్గాపురం లో జరిగిన కోడిపందాల లో ఓ బంగారు నగల కోడిపుంజు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. యజమాని కోడిపుంజుకు 15 కాసుల బంగారు గొలుసు, పులిగోరుతో ప్రత్యేకంగా అలంకరించిన ఆ కోడిపుంజును బరిలోనికి ప్రవేశపెట్టారు. జీడిపప్పు బాదం వంటి శక్తివంతమైన ఆహారముతో పుంజు సిద్ధం చేయబడి, కాలికి కత్తి కట్టుకొని పందెంలో ఘనవిజయాన్ని సాధించింది. ఈ ప్రత్యేక బంగారు పులిగోరు కోడిని చూచేందుకు పందెం రాయుళ్లు నిర్వాహకులు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### బీజేపీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్

- దాదాపు ఖరారు చేసిన జాతీయ పార్టీ
- జనవరి 20న అధికారిక ప్రకటన
- ఈ నెల 19న నామినేషన్ల దాఖలు, అదే రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ
- మరుసటి రోజు కొత్త అధ్యక్షుడి పేరు వెల్లడి



**న్యూఢిల్లీ, మహా :** బీజేపీ జాతీయ అధ్యక్షుడి ప్రకటన తేదీ ఖరారైంది. బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ఎన్నికల ప్రక్రియను అధికారికంగా ప్రకటించింది. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ఎన్నికల ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె. లక్ష్మణ్ ఒక అధికారిక ప్రకటనలో సంస్థాగత కసరత్తు కోసం షెడ్యూల్‌ను వెల్లడించారు.

మిగతా 3లో

### మహా విజయం మున్సి పోల్స్ లో మహాయుతి హవా

**ముంబై, మహా:** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయఢంకా మోగించింది. మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరగగా 25 చోట్ల బీజేపీ సారథ్యంలోని మహాయుతి గెలుపొందింది. థాక్రే కుటుంబానికి కంచుకోట లాంటి ముంబయి నగరాన్నీ మహాయుతి కైవసం చేసుకుంది.

మిగతా 3లో





# చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి

## రాక్షసుల్లా బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

- మీ మనసులు గెలుస్తాం..
- 2034 దాకా అధికారంలో ఉంటాం
- బాసరలో ఆదిలాబాద్ యూనివర్సిటీ ప్రారంభిస్తా
- పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ కు నిధులిస్తా
- 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుచేస్తాం
- నిర్మల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చనాకా కొరాటా, సదర్ మాట్ బ్యారేజీలు ప్రారంభించిన సీఎం
- గత పదేళ్లలో పూర్తికాని ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నాం

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం సీఎం పర్యటించిన ఆయన.. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు.

**సరైన న్యాయం జరగలేదు**

పోరాటం, పౌరుషాల గడ్డ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సరైన న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆదిలాబాద్‌కు కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ అభివృద్ధికి నిధులు ఇస్తామని స్పష్టం చేశారు ముఖ్యమంత్రి.

మిగతా 2లో



### సీఎం రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా చనాకా కొరాట ప్రాజెక్టు పంప్ హౌస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి హతిఘాట్ పంప్ హౌస్ వద్ద ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. అనంతరం సీఎం వెంట ఆయన కాన్వాయ్ వరకు నడిచారు. అక్కడి నుండి పంప్ హౌస్ వరకు సీఎం తో పాటు కలిసి వెళ్ళారు. ఈ సందర్భంగా సీఎం శ్రీనివాసరెడ్డిని ఆత్మీయంగా పలకరించారు. నియోజకవర్గంలోని నేతలను సీఎంకు కంది శ్రీనివాసరెడ్డి పరిచయం చేశారు.

## ఆ ముగ్గురిపై ఎందుకు లేటు?

- స్పీకర్ పై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం
- నాలుగువారాల్లో తేల్చాలని గడువు

**ఢిల్లీ, మహా:** పార్టీ ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. ఈ నాలుగు వారాల్లో ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తిచేసి నిర్ణయం వెలువరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సత్వరమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ విచారణలో సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి, కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్లు

మిగతా 2లో



## రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో మహర్దశ.. మంత్రి సీతక్క



**వేములవాడ, మహా :** భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

మిగతా 2లో







# చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి లేకుంటే
# ఫామ్‌హౌస్‌లోనే ఉండండి

(మొదటిపేజీ తరువాయి)

చనాక కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ యూనివర్సిటీని తానే ప్రారంభిస్తానని రేవంత్ చెప్పుకొచ్చారు.కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాగోబా జాతరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రూ.300 కోట్లతో మేడారం ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు సీఎం రేవంత్.

**అందుకే మోదీని కలుస్తున్నా**

'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధికి 10వేల ఎకరాల భూసేకరణ జరుపుతాం. పరిశ్రమలు వస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధికి కలిసి పనిచేద్దాం. అందుకే ప్రతి మూడు నెలలకోసారి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుస్తున్నాం. బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువస్తే పరిష్కరిస్తాం. నేను తరచూ ప్రధానిని కలవడంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు నరేంద్ర మోదీతో బంధుత్వం లేదు.. చుట్టమూ కాదు. ఆయన మనకు ప్రధాని.. ఆయనతో పనులు చేయించుకుంటున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా, పైరవీల కోసం పోవడం లేదు, పర్సనల్ ఎజెండా ఏమీ లేదు. ఎవరిని కలిసినా అభివృద్ధి కోసమే. కేంద్రం సహకారంతోనే అవసరమైన ఎయిర్ పోర్టులు, నిధులు వస్తున్నాయి. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు.

**రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు**

'పదేళ్ల పాలనలో ఏమీచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2034వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ గెడం నగేష్,ఎమ్మెల్సీలు దండే విటల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు మాజీ మంత్రులు వేణుగోపాల చారి, ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు,విఠల్ రెడ్డి,రేఖానాయక్, నియోజక వర్గ ఇంచార్జీలు కంది శ్రీనివాస రెడ్డి, శ్రీహరి రావు,ఆడె గజేందర్, శ్యామ్ నాయక్ ,నారాయణ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## మూడు రోజులుగా అన్నం తినలేదు

- బావిలో దూకమన్నా సిద్ధం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మద్ధతుగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలు

**జడ్చర్ల, మహా :** రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన అత్యంత భావోద్వేగంగా మాట్లాడుతూ, కోమటిరెడ్డిని 'శ్రీరాముడి'తో పోల్చారు. ఒక దేవుడి లాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ప్రచారాలు చేయడం చూస్తుంటే రక్తం మరుగుతోందని, ఈ బాధతో తాను గత మూడు రోజులుగా తిండి కూడా తినలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సాగుతున్న ఈ కుట్రల వెనుక ఎవరున్నారో త్వరలోనే తేలుతుందని ఆయన హెచ్చరించారు. మంత్రిపై వస్తున్న ఆరోపణలను సాంకేతికంగాను, వ్యక్తిగతంగాను అనిరుధ్ రెడ్డి తిప్పికొట్టారు. మంత్రికి గత కొంతకాలంగా ఉన్న గొంతు సమస్య వల్ల ఆయన మాటలో వచ్చే మార్పులను ఆసరాగా చేసుకుని, కొందరు పనిగట్టుకుని అపనిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కోమటిరెడ్డికి దాపరికం తెలియదు, కనీసం ఆయన మొబైల్‌కు లాక్ కూడా ఉండదు. అంతటి నిప్పు లాంటి మనిషిపై బురద చల్లడం దారుణమని పేర్కొన్నారు. తాను కోమటిరెడ్డికి వీరాభిమానినని, ఆయన బావిలో దూకమన్నా దూకడానికి సిద్ధంగా ఉన్నానని, ఆయన కోసం ప్రాణాలైనా ఇస్తానంటూ తన విధేయతను చాటుకున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంపై అధికారికంగా విచారణ జరుగుతోందని, త్వరలోనే అసలు నిజాలు బయటకు వస్తాయని అనిరుధ్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రతిపక్షాలు, గిట్టని వారు ఇలాంటి చిల్లర వేషాలు వేస్తున్నారని, ఇలాంటి కుతంత్రాలకు కాంగ్రెస్ శ్రేణులు భయపడవని స్పష్టం చేశారు. మంత్రికి పార్టీ మొత్తం అండగా ఉంటుందని, విచారణలో ఆయన నిర్దోషిగా తేలుతారని ధీమా వ్యక్తం చేశారు. ఒక మేరునగ ధీరుడిపై జరుగుతున్న ఈ దాడిని ప్రజలు కూడా గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేసే వారికి కాలమే సమాధానం చెబుతుందని అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు.

## రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు. అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా



పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు.

**రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ..**

రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కలు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.

## అవును.. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉంది

- ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు
- టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చిన నిజామాబాద్ ఎంపీ



**హైదరాబాద్, మహా :** శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఆయన ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన అరవింద్ అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు ఉండాలన్నారు. ఇందూర్ గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారని, మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారని వ్యాఖ్యానించారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుంది అని అంటున్న వారు మాజీ ఎమ్మెల్సీ కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. "గొడవలకు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య అనే ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్ అని అన్నారు. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి అని అన్నారు. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం... తీర్మానం చేసి రాష్ట ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ.." అని ఎంపీ వ్యాఖ్యానించారు.

## ట్రోలర్స్‌కు అనసూయ షాక్

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు
- ఆన్‌లైన్‌లో వేధింపులు, అసభ్య ప్రచారంపై కంప్లైంట్
- 42మందిపై కేసు నమోదు

**హైదరాబాద్, మహా :** ప్రముఖ నటి, టీవీ యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం సినీ, సోషల్ మీడియా వర్గాల్లో సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్, వ్యక్తిత్వ హననం అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. గతేడాది డిసెంబర్ 23వ తేదీ నుంచి తనపై ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**కేసు వివరాలు, నిందితుల జాబితా..**

నిందితుల పేర్లతో పాటు సోషల్ మీడియా లింకులు ఫిర్యాదుతో జత చేశారు అనసూయ. సోషల్ మీడియాలో తనపై క్యాంపెయిన్ తరహాలో దాడి జరిగిందని చెప్పుకొచ్చారు. ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయం చెప్పిన తర్వాతే ఈ వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక దూషణలు, బెదిరింపులు జరిగాయని ఫిర్యాదులో వెల్లడించారు. క్రిమినల్ డెఫమేషన్, వ్యక్తిగత వేధింపులు, ఏఐ ఫోర్జరీ వంటి నేరాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. అనసూయ ఫిర్యాదుతో మొత్తం 42 మందిపై కేసు నమోదైంది. కొందరు వ్యక్తులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఖాతాదారులపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

**ఎవరెవరిపై కేసులు..**

సీనియర్ నటి కరాటే కల్యాణి, ప్రముఖ రేడియో జాకీ శేఖర్ బాషా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని, పావని, రజిని, నటి విజయలక్ష్మి, యాంకర్ రోహిత్, మరికొందరు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు, యాంకర్లు ఉన్నారు. వీరు వివిధ సోషల్ మీడియాల వేదికగా విమర్శలు చేశారని అనసూయ ఫిర్యాదు చేశారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేయడం, తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు రూపొందించడం, తన వృత్తిని, వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని కొందరు కంటెంట్ క్రియేటర్లు వ్యూస్ కోసం కించపరిచేలా మాట్లాడుతున్నారని అనసూయ ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో గ్రూపులుగా ఏర్పడి తనను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో తనపై అభ్యంతరకర పదజాలం వాడటం, వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు, మహిళగా తన గౌరవాన్ని కించపరిచేలా పోస్టులు పెట్టడం, వీడియోలు చేయటం, ట్రోలింగ్ పేరుతో మానసిక వేధింపులకు గురిచేయటం, ఉద్దేశపూర్వకంగా పరువు నష్టం కలిగించే ప్రచారం చేయడం వంటి చర్యలు తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఫిర్యాదులో అనసూయ రాసుకొచ్చారు

### సీరియస్ గా తీసుకున్న సైబర్ క్రైం పోలీసులు

**అనసూయ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, కామెంట్లను పరిశీలించిన అనంతరం.. ఐటీ యాక్ట్, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా నిందితులకు నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, న్యాయపరమైన పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసులతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.**

## ఆ ముగ్గురిపై ఎందుకు లేటు?

(మొదటిపేజీ తరువాయి)

పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్, కేటీఆర్ తరపు న్యాయవాదులు వివరించారు. విచారించిన ధర్మాసనం స్పీకర్‌కు 4 వారాల సమయమిస్తూ వాయిదా వేసింది. దీంతో స్పీకర్ ఫిబ్రవరి 14లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**ఇద్దరు ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్ ఇచ్చిన స్పీకర్**

సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వేసిన పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో స్పీకర్ ముందుగానే స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ గురువారం క్లీన్‌చిట్ ఇచ్చారు. వారు పార్టీ మారారనేందుకు ఆధారాలు లేవన్నారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన పది మందిలో గతంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చేశారు. వీరు కాకుండా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై వచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ విచారణ జరపాల్సి ఉంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి అయింది. కానీ తీర్పును ఇంకా వెల్లడించలేదు. స్పీకర్ తీర్పును రిజర్వులో ఉంచారు.

### బీజేపీ నూతన అధ్యక్షుడు
# నితిన్ నబీన్

- దాదాపు ఖరారు చేసిన జాతీయ పార్టీ
- జనవరి 20న అధికారిక ప్రకటన
- ఈ నెల 19న నామినేషన్ల దాఖలు, అదే రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ
- మరుసటి రోజు కొత్త అధ్యక్షుడి పేరు వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి కోసం జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నాయని, మరుసటి రోజు 20వ తేదీన కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని తెలిపారు. జనవరి 19న మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య నామినేషన్లను దాఖలు చేస్తారని వెల్లడించారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య నామినేషన్ పత్రాల పరిశీలన, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఆరున్నర గంటలకు అధికారిక పత్రికా ప్రకటన జారీ చేస్తామని, అనంతరం మరుసటి రోజు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య ఢిల్లీలో కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామని లక్ష్మణ్ తెలిపారు. బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఇటీవల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయననే నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని బీజేపీ భావిస్తోందని సమాచారం. యువ నాయకత్వాన్ని తయారు చేసుకోవడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయి. నబీన్ బీహార్‌లో ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. గతంలో సిక్కిం, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు. డిసెంబర్ 14న ఆయన పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

# త్వరలోనే అన్ని ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తాం : సీఎం రేవంత్ రెడ్డి







**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆక్షేపించారు. గత ప్రభుత్వం సొంత లాభం చూసుకుందని, కుటుంబం, పార్టీ, రాజకీయ అవసరాలే ప్రాధాన్యంగా పని చేసిందని మండిపడ్డారు. వారి ఉద్యోగాలు ఊడితేనే నిరుద్యోగులకు కొలువులు వస్తాయని యువత భావించిందన్నారు. దీంతో వారి ఉద్యోగాలు ఊడగొట్టి, ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. 14 ఏళ్ల పాటు గ్రూప్1 పరీక్షలు నిర్వహించలేదని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే వారు సంవత్సరాలుగా నోటిఫికేషన్ల కోసం ఎదురు చూశారని అన్నారు. గత ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని అభిప్రాయపడ్డారు. పరీక్షల పేపర్లు లీకవ్వడం, మళ్లీ మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. దీని ద్వారా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, హర్కర్ వేణుగోపాల్ రావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ,కాలే యాదయ్య ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, వివిధ శాఖల ఉన్నత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో
# ఇన్స్ స్పెక్టర్ల బదిలీ

**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ని నర్సంపేట పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎల్ రఘుపతి, సిసిఆర్ బి కి బదిలీ కాగా, ప్రస్తుతం సిసి ఆర్ బి లో విధులు నిర్వహిస్తున్న యం. శ్రీనివాస్ ను నర్సంపేట ఇన్స్ స్పెక్టర్ గా బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా విఆర్ లో ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.వెంకన్న ను ప్రస్తుత ఖాళీలో ఉన్న సుబేదారి పోలీస్ స్టేషన్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

# మహా విజయం

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోనే సంపన్న ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లోని 227 వార్డులకుగానూ 84 చోట్ల బీజేపీ, 26 చోట్ల శివసేన (షిండే) గెలిచాయి. శివసేన (ఉద్ధవ్) 74 సీట్లకు పరిమితమైంది. మ్యాజిక్ ఫిగర్ 114కు కేవలం 4 సీట్ల దూరంలో (110 వద్ద) మహాయుతి ఉంది. మహారాష్ట్రలోని మొత్తం 2,869 వార్డులకుగానూ 1,388 సీట్లను బీజేపీ, 364 సీట్లను శివసేన (షిండే), 150 సీట్లను ఎన్‌సీపీ(అజిత్) గెల్చుకున్నాయి. కాంగ్రెస్ 306 సీట్లను, శివసేన (ఉద్ధవ్) 166 సీట్లను దక్కించుకున్నాయి. అసదుద్దీన్ ఒవైసీకి చెందిన మజ్లిస్ పార్టీ సైతం 94 సీట్లలో ఆధిక్యంలో ఉంది. థ్యాంక్యూ మహారాష్ట్ర. సుపరిపాలన అందించాలనే ఎన్‌డీఏ అజెండాకు ప్రజలు ఓటు వేశారు. థ్యాంక్యూ మహారాష్ట్ర అంటూ ప్రధాని ట్వీట్ చేశారు.

## ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మంది అరెస్టు

**వరంగల్, మహా :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. "ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయి. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముంది" అని సీపీ తెలిపారు.



### కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**కరీంనగర్ మహా :** కరీంనగర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేలా సత్పతి క్యాంప్ కార్యాలయంలో గురువారం సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, సిబ్బంది పండుగ వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన పర్వదినమని తెలిపారు. వ్యవసాయం, ప్రకృతి, కుటుంబ బంధాల ప్రాధాన్యతను ఈ పండుగ ప్రతిబింబిస్తుందన్నారు. అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ ఆత్మీయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యత మంచి వాతావరణం పెంపొందించేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రోపై కేంద్రం మెలిక

మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్రం
సీఎం రేవంత్ కు లేఖ రాసిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించారని సీఎంకు లేఖలో గుర్తు చేసిన కిషన్ రెడ్డి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.



## జైపాల్ రెడ్డి రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు మరువలేనివి : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ఆయన కీలక భూమిక పోషించారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను కేంద్రానికి వివరించడంలో ఆయన సఫలీకృతుడయ్యారని కొనియాడారు. అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా జైపాల్ రెడ్డి చూపిన బాట స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని పీవీ మార్గ్ వద్ద ఉన్న స్ఫూర్తి స్థల్‌లో శుక్రవారం జైపాల్ రెడ్డి 84వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని జైపాల్ రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పలకరించారు. జైపాల్ రెడ్డి కార్యదక్షుడని, పార్లమెంట్‌లో తన గళాన్ని గొప్పగా వినిపించే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, హౌసింగ్, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేమ్ నరేందర్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యుడు మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొని జైపాల్ రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

### కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో
# వసూళ్ల రగడ

**ఉద్యోగులనే ఏసీబీకి పాటిస్తా అంటున్న అధికారి**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారుతోంది. ఈ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న రెవిన్యూ ఉద్యోగులు ప్రతి పనికో రేటుగా వసూళ్లకు పాల్పడుతున్నారని గత కొంతకాలంగా బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్ అధికారి పేరు చెప్పుకొని రెవెన్యూ ఉద్యోగులు వారి ఇష్టానుసారం ప్రతి ఫైల్ కు ఒక రేటును నిర్ణయించుకొని అమాయకపు ప్రజల నుండి భారీ వసూళ్లకు పాల్పడుతున్నారనే విషయం ఇటీవల స్వయంగా ఆ కార్యాలయ అధికారి సర్కిల్ గ్రూపులో ఓ మెసేజ్ చేసినట్టు తెలిసింది. అంటే ఏ రేంజ్ లో వసూళ్లు జరుగుతున్నాయో అర్థమవుతోంది. ముఖ్యంగా ఈ విషయాన్ని సర్కిల్ అధికారే స్వయంగా గ్రూపులో మెసేజ్ పెట్టి ఏసీబీకి మీ మీద ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో ఈ వసుళ్ళ విషయం కాస్త బయటపడింది. మరల ఈ విషయం బయటికి తెలిస్తే ఏమవుతుందో అని మెసేజ్ పెట్టిన అధికారే మరల డిలీట్ చేసినట్టు సమాచారం. అధికారి ఉద్యోగుల వసూళ్ల పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో త్వరలోనే పూర్తి వివరాలతో మహా పత్రికలో మీ ముందుకు .

### భూభారతి అక్రమాలపై
# కేసు నమోదు

**రిమాండ్ కు తరలింపు**

**వలిగొండ, మహా :** ఇటీవలన వలిగొండ మండల కేంద్రంలో భూభారతి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలపై రెండు రోజుల క్రితమే మహా న్యూస్ ప్రచురించిన విషయం విధితమే శుక్రవారం వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన భూభారతి ఆపరేటర్ల పై వలిగొండ తహసిల్దార్ దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని భారీ మొత్తంలో మోసం చేయడం పట్ల వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ శుక్రవారం కలకూరి మధు. భువనేష్. రాకేష్. బసవరాజు. శివ రామకృష్ణ. రాజు .తరుణ్. లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు తదుపరి ఇన్వెస్టిగేషన్ చేసి బాధ్యులైనటువంటి ప్రతి ఒక్కరి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కాంగ్రెస్‌తోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యం..





- **కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పట్టం కట్టండి..**
- **కరీంనగర్‌ను ఖతర్నాక్‌గా అభివృద్ధి చేస్తాం..**
- **పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం..**
- **కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్రావు..**
- **కరీంనగర్లో వినూత్నంగా బస్తీబాట కార్యక్రమానికి శ్రీకారం..**
- **కాంగ్రెస్ నాయకులతో కలిసి 30 డివిజన్ ప్రజలతో మమేకం..**

**కరీంనగర్ మహా :** కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేసిన అనంతరం కరీంనగర్‌కు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి నగరాన్ని ఖతర్నాక్‌గా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో శుక్రవారం రాత్రి వెలిచాల రాజేందర్ రావు 'బస్తీబాట' పేరిట కాంగ్రెస్ నేతలతో కలిసి వినూత్న కార్యక్రమానికి స్వీకారం చుట్టారు. నగరంలోని 30 డివిజన్ లో కాంగ్రెస్ నాయకుడు కళ్ళేపల్లి బాలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ ప్రజలతో రాజేందర్రావు మమేకమయ్యారు. ఇంటింటా తిరుగుతూ మౌలిక సదుపాయాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్ వంటి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. సమస్యలు నోట్ చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా వరదలా నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని కరీంనగర్ ను అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మరి ఏ పార్టీతోను అభివృద్ధి సాధ్యం కాదని కరీంనగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించే బాధ్యత నేను తీసుకుంటానని భరోసా కల్పించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టణ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో నగరాభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణలో ఎలాంటి లోటు ఉండదని, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే కరీంనగర్ రూపురేఖలే మారుతాయని రాజేందర్‌రావు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. బస్తీబాట కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు మహిళలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కల్లెపల్లి బాలరాజు, గండి రాజేశ్వర్, ఎండి సలీం, బట్టు వరప్రసాద్, గండి శ్యామ్, గండి గణేష్, కాసారపు కిరణ్ కుమార్ సలీం, డివిజన్ నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బిజెపిని బొంద పెట్టుడు ఖాయం..**

కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బిజెపి ని ప్రజలంతా బొంద పెట్టుడు పెట్టుడు ఖాయమని తేలిపోయిందని ప్రజలంతా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ముఖ్యమంత్రి శక్తిని పెంచుదామని పిలుపునిచ్చారు.. శుక్రవారం కొత్తపెల్లి వెలిచాల ప్రజా కార్యాలయంలో వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో రేకుర్తి నుంచి బీఆర్ఎస్ నాయకుడు నందెల్లి ప్రకాష్ ఆధ్వర్యంలో 200 మంది బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరినీ పార్టీలోకి ఆహ్వానించి రాజేందర్ రావు కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన నాయకులు కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 5 రోజుల్లో 3 లక్షలకు పైగా
# వాహనాల రాకపోకలు

**విజయవాడ నేషనల్ హైవే రికార్డ్**



**హైదరాబాద్, మహా :** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నగరం దాదాపు ఖాళీ అయింది. ఏపీలోని తమ సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి గత ఐదు రోజులుగా కిటకిటలాడింది. పండుగ రద్దీ కారణంగా ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అసాధారణ రీతిలో పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద నమోదైన గణాంకాల ప్రకారం, కేవలం 5 రోజుల వ్యవధిలోనే రెండు వైపులా కలిపి మొత్తం 3.04 లక్షల వాహనాలు ప్రయాణించడం ఒక రికార్డుగా నిలిచింది. ఇందులో సుమారు 2.04 లక్షల వాహనాలు కేవలం హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లినవే కావడం గమనార్హం.

**శనివారం ఒక్కరోజే 71 వేలకు పైగా వాహనాలు**

టోల్ ప్లాజా లెక్కల ప్రకారం, శనివారం ఒక్కరోజే అత్యధికంగా 71,284 వాహనాలు ప్రయాణించాయి. అలాగే శుక్రవారం 53 వేలు, ఆదివారం 62 వేలు, సోమవారం 56 వేలు, మరియు మంగళవారం 62 వేల వాహనాలు పంతంగి టోల్ ప్లాజాను దాటాయి. బుధవారం భోగి పండుగ కావడంతో రద్దీ కొంత సాధారణ స్థితికి చేరుకుంది. గత ఏడాది మూడు రోజుల ముందు వరకు 2.07 లక్షల వాహనాలు మాత్రమే ప్రయాణించగా, ఈసారి ఆ సంఖ్య ఏకంగా 3 లక్షలు దాటడం ఈ ఏడాది పండుగ రద్దీ తీవ్రతను సూచిస్తోంది.

**ఓవైపు అభివృద్ధి పనులు, మరోవైపు పండుగ ట్రాఫిక్ జామ్**

ప్రయాణికుల రద్దీ భారీగా ఉన్నప్పటికీ, టోల్ ప్లాజాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం, ఫాస్టాగ్ స్కానింగ్‌ను వేగవంతం చేయడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఉన్నా, త్వరగా సమస్య పరిష్కారమై ప్రయాణాలు సాఫీగా సాగాయి. దీనికి తోడు జాతీయ రహదారిపై జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా, చాలామంది ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం కూడా ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి దోహదపడింది. గుంటూరు, నెల్లూరు వంటి జిల్లాలకు వెళ్లేవారు సాగర్ హైవే వైపు, ఖమ్మం వైపు వెళ్లేవారు భువనగిరిచిట్యాల మార్గంలో ప్రయాణించడంతో ప్రధాన రహదారిపై ఒత్తిడి కొంతమేర తగ్గినట్లు అధికారులు తెలిపారు.



### చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు
# రజక సంఘం నిర్ణయం

**వలిగొండ, మహా:** వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహానికి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రజక సంఘం గ్రామ నేతలు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఐలమ్మ విగ్రహాలు ఏర్పాటు చేసి, రజక కులస్తుల ఐక్యతను చాటాలని, హక్కుల సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. నేడు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై, తమ హక్కుల కోసం ఉద్యమించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేమాన్ మహేందర్ రవి, మధుసూదన్ నాగరాజు శ్రీనివాస్, మధు, లక్ష్మణ్ నరేష్ అశోక్, మహేందర్ మహేష్‌నాగరాజు, రమేష్, గణేష్, సత్తయ్య లక్ష్మయ్య, ఎల్లయ్య,అనపర్తి భాస్కర్, వడ్లకొండ సత్తయ్య మల్లేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నారావారిపల్లిలో చంద్రబాబు సంక్రాంతి

## కుటుంబసభ్యులతో కలిసి వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి



**మహా, తిరుపతి:** సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా గురువారం పలు కార్యక్రమాల్లో చంద్రబాబు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ముందుగా గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆపై నాగాలమ్మకు పూజలు చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు తన తల్లిదండ్రులకు నివాళులర్పించారు. సీనియర్ ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకూ సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులు పుష్పాంజలి ఘటించారు.

### ప్రతి ఒక్కరూ సొంతూళ్ళ అభివృద్ధికి తోడ్పడాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన నారావారిపల్లిలో పర్యటించి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. మనం పుట్టిన ఊరిని ఎన్నటికీ మరువకూడదని, ప్రతి ఒక్కరూ తమ స్థోమతకు తగ్గట్టుగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి రైతులు ఆనందంగా ఉండే పండుగ అని, ఈ సందర్భంగా కోడిపందేలు, జల్లికట్టు వంటి వినోద క్రీడలు ఆహ్లాదాన్ని ఇస్తాయని ఆయన గుర్తు చేసుకున్నారు. 2047 నాటికి స్వర్ణ ఆంధ్రప్రదేశ్ వికసిత్ భారత్ లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం పెరగడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు.









**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999



## ఎర్రవెల్లి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు..

ఎర్రవెల్లి నివాసంలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆనందంగా పాల్గొన్నారు. కేసీఆర్ సతీమణి శోభమ్మ, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, శైలిమతో పాటు కేసీఆర్ మనవడు, మనవరాలు ఈ వేడుకల్లో పాల్గొని పండుగను కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకున్నారు.



# మొయినాబాద్ మున్సిపాలిటీ 15 కోట్ల నిధులతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

**మొయినాబాద్ మహా:** మున్సిపల్ పరిధిలోని యెన్కెపల్లి ,మూర్తుజాగూడ, సురంగల్, చిల్కూర్, పెద్దమంగళారం, అపోజిగూడ, వార్డుల అభివృద్ధి కోసం 15 కోట్ల నిధులతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులకు శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీకి 15 కోట్ల నిధులు కేటాయించింది, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిస్తుందని అన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది, కాంగ్రెస్ పార్టీతో పేద ప్రజలకు న్యాయం, సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ నిర్మాణం ద్వారా కాలనీలో గ్రామాల్లో రోడ్లపై నీరు నిలవడం బురద వంటి సమస్యలు తొలగిపోతాయని, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి సమస్యలు లేని మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, పల్లగొల్ల మల్లేష్ యాదవ్, రామకృష్ణ గౌడ్, రవీందర్ రెడ్డి,పల్లగొల్ల అశోక్ యాదవ్, గున్నాల సుధాకర్ రెడ్డి, చిలుకూరు రాజు, బేగరీ రాజు, గడ్డం వెంకట్ రెడ్డి, పట్నం రాంరెడ్డి, నేరెట్ల రాజుగౌడ్, సురంగల్ యాది గిరి చారి, యెన్కెపల్లి మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ చందన చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లం వెంకటేష్ గౌడ్, ఎల్గని సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యాలటి రాజేష్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కావాలి రమేష్ ముదిరాజ్, న్యాలటి చిట్టిబాబు, యోంగని న్యాయవాది మల్లేష్,శివ రెడ్డి, అశోక్ రెడ్డి, అనంతరెడ్డి, ఈదుల కంటి వెంకటేష్ ముదిరాజ్, నాగేందర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్,అల్లం హరీష్ గౌడ్, సురేష్ గౌడ్,రవి శ్యామ్,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# అప్పు తిరిగిచ్చే ఇష్టం లేక హత్య

- మిస్సింగ్ కేసు మహిళ హత్యకు గురయినట్టు తేల్చిన పోలీసులు
- మావల పోలీస్ స్టేషన్ లో వివరాలు వెల్లడించిన ఎస్పీ




**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళ మిస్సింగ్ కేసును ఛేదించినట్టు, అది హత్య కేసుగా నమోదు చేసి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం మావల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గత నవంబర్ 29న హతురాలు పిట్టల వాడకు చెందిన ఇమ్రానా జబీన్ నవంబర్ 26 నుంచి కనిపించడం లేదని తన సోదరి సమీనా యాస్మీన్ ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. విచారణలో ఇమ్రానా జబీన్‌కు ఇంద్రవెల్లికి చెందిన ఫారూఖ్ ఖాన్ తో ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం ఉన్నట్లు గుర్తించారు. సీఐ కె. స్వామి నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ చేపట్టి, సాంకేతిక ఆధారాలతో ఈనెల 14న దస్నాపూర్ కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రధాన నిందితుడు మొహమ్మద్ ఫారూక్ ఖాన్ అతని డ్రైవర్ బస్సీ రమేష్ లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసారు. విచారణలో నిందితులు హత్యకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారని తెలిపారు. హతురాలుకు ఫారూఖ్ సుమారు రూ.8 లక్షల 80వేల నగదుతో పాటు, 8.5 తులాల బంగారం బాకీ ఉండగా, తన సొంత అవసరాల నిమిత్తం ఆమె డబ్బులు తిరిగి అడగడంతో తిరిగి ఇచ్చేందుకు ఇష్టపడని నిందితుడు హత్యకు కుట్ర పన్నినట్లు తెలిపారు. గత నవంబర్ 26న పిట్టలవాడలోని ఆమె నివాసంలోనే తన డ్రైవర్ రమేష్ సహాయంతో జబీన్ ను ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు.అనంతరం మృతదేహాన్ని అద్దెకు తీసుకున్న ఎర్టిగా కారులో మహారాష్ట్రలోని సర్కాని ఘాట్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, కల్వర్ట్ సమీపంలో గుంతలో పూడ్చినట్లు వెల్లడించారు. నిందితుల సమాచారంతో రెవెన్యూ, వైద్య శాఖల సమన్వయంతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీసారు. శరీరం కుళ్లిపోయినప్పటికీ, మృతురాలి దుస్తుల ఆధారంగా కుటుంబ సభ్యులు గుర్తించడంతో డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలు సేకరించారు. ఇద్దరు నిందితులను న్యాయస్థానానికి హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మావల సీఐ కర్రె స్వామి, ఎస్సైలు మధుకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**ఆమనగల్లు, మహా:** కేంద్ర మాజీ మంత్రి దివంగత జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.ఆయన జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆమనగల్లు,కడ్తాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కండే పాండురంగయ్య, వస్పుల శ్రీశైలం,నాయకులు, అలీమ్, ఫరీద్, కృష్ణ నాయక్ ,ఖాదర్, పర్వతాలు, శ్రీకాంత్, పులికంటి మైసయ్య,కలీం, మహేష్ రహీం, మల్లేష్ ,రఫీ,నాసర్, హరిలాల్, తదితరులు ఉన్నారు

# యువత చదువుల క్రీడల్లో రాణించాలి




- కర్ణగూడలో క్రికెట్ టోర్నమెంట్
- నిర్వహించిన గ్రామ సర్పంచ్ తిరుమలరెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** కర్ణగూడ గ్రామంలోని యువతకు క్రీడల్లో స్ఫూర్తిదాయకంగా నిలవడానికి కేపీఎల్ టోర్నీ దోహదపడుతుందని సర్పంచ్ తిరుమలరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కర్ణగూడ గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాని అంటాయి. గ్రామ సర్పంచ్ వంగెటి తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో కేపీఎల్ ట్రోఫీని నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ప్రారంభించిన క్రికెట్ టోర్నీ శుక్రవారం కనుమ పండుగతో ముగిసింది. మూడు రోజులపాటు కొనసాగిన ఈ యొక్క క్రీడలో దేరంగుల మహేష్ టీం విజయం సాధించగా, గ్రామ సర్పంచ్ వంగెటి తిరుమలరెడ్డి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. రెండో విజేతకు నల్లబోలు శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ రవీంద్ర రెడ్డిలు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుమలరెడ్డి మాట్లాడుతూ... పండుగ వేళలో యువత క్రీడలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. యువకులు చెడు మార్గాల్లో వెళ్లకుండా మద్యానికి, మాదకద్రవ్యాలు గంజాయి, డ్రగ్స్ లాంటి వాటికి బానిస కాకుండా క్రీడల వైపు వెళ్లాలని ఆయన సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువకులు గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.



## సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

**ఆమనగల్లు, మహా:** సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని బీఆర్ఎస్ నాయకులు వరికుప్పల గణేష్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్ లు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని గుర్రం గుట్ట కాలనీలో మున్సిపల్ అధ్యక్షుడు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు పత్య నాయక్ అధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు, చీరలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం నేటితరం యువతకు ఉందన్నారు. నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి పోటీలు వేదికగా నిలుస్తాయని, కుటుంబాల మధ్య స్నేహ బంధం పెంపొందుతుందన్నారు. మహిళలు సమాజ పోకడలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని, మహిళా రక్షణ చట్టాల అమలు, ప్రభుత్వ హామీల సాధనకోసం ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువ నాయకుడు కొమ్ము ప్రసాద్, వస్పుల జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గణేష్ నాయక్, రేపాని శివ, గుగ్గిళ్ళ అంజి, విమలమ్మ, లలిత, స్పందన, జ్యోతి, ఆండాలు, రాకేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

# జిల్లా స్థాయి సంక్రాంతి కవి సమ్మేళనం



**ఆదిలాబాద్ మహా:** తెలుగువారి సంస్కృతిలో సంక్రాంతి పండగ విశిష్టమైనదని, పండగ ద్వారా వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ ప్రకృతిని ఆస్వాదించే తీరును పలువురు కవులు, రచయితలు, కళాకారులు తెలిపారు. మకరసంక్రాంతి సందర్భంగా గురువారం నిర్మల భారతి సాహిత్య కళా సాంస్కృతిక సామాజిక సేవా క్షేత్రం, నిర్మల్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీయు సంఘ భవనంలో సంక్రాంతి వైభవం అంశంపై జిల్లా స్థాయి సంక్రాంతి కవిసమ్మేళనం నిర్వహించారు. నిర్మల్ జిల్లా కవులు ,కళాకారులు కార్యక్రమంలో పాల్గొని తమ కవితలు, పాటలద్వారా పండగ యొక్క ఔన్నత్యాన్ని, పౌరాణిక ప్రాశస్త్యాన్ని, పండగకు ప్రకృతికి మధ్య గల సంబంధాన్ని తెలియజేశారు.అనంతరం కవులను, గాయకులను నిర్మల భారతి ఆధర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నిర్మలభారతి అధ్యక్ష్య ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి పరమేశ్వర్, డా. బి వెంకట్, సంయుక్త కార్యదర్శులు అంబటి నారాయణ,యార సాయినాథ్ రెడ్డి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు, కవులు డా.దామెర రాములు, డా.మురళీధర్, డా.కృష్ణంరాజు, డా వేముగోపాలకృష్ణ, చట్ల గజ్జారామ్, పోలీస్ భీమేశ్, పాటే మా ప్రాణం సంగీత అకాడమీ డైరెక్టర్ చెనిగారం నాగరాజు,వెన్నెల డాన్స్ అకాడమీ డైరెక్టర్ ధనరాజ్ ,గాయకురాలు సాయిప్రియ,కవియాత్ర చైర్మన్ కారం నివేదిత, కలం స్నేహం జిల్లా అధ్యక్షురాలు దేవిప్రియ,కారం ప్రణతి,భిక్షపతి నాయక్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఛలో నిర్మల్

- సీఎం సభ కోసం కంది శ్రీనివాస రెడ్డి బస్సుల ఏర్పాటు
- 50 బస్సులలో తరలి వెల్లిన శ్రేణులు, అభిమానులు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాల పర్యటన విజయవంతానికి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి విస్తృత ఏర్పాట్లు చేసారు. చలో నిర్మల్ పేరుతో 50 బస్సుల్లో శ్రేణులను తరలించారు.ఆయన ఏర్పాటు చేసిన బస్సులలో పెద్ద ఎత్తున కార్యకర్తలు సీయం సభకు నిర్మల్ కు తరలి వెళ్లారు, కంది శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు.

## కల్వకుర్తి జిల్లా ఏర్పాటు చేసి జైపాల్ రెడ్డి పేరు పెట్టాలి:తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, మహా:** కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి పేరిట కల్వకుర్తి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. శుక్రవారం శక్తి స్థల్లో జైపాల్ రెడ్డికి నివాళులర్పించిన ఆయన సీఎంను కలిసి కల్వకుర్తిని జిల్లా కేంద్రంతో పాటు ఆమనగల్లులో ఎస్జీఓ, ఆర్డీఓ,ఆర్టీఓ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

## మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలోని సాగు భూములలో చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేపు సాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం నీటిపారుదల శాఖ, ఇతర అధికారులతో కలిసి సాగునీటి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గూడెం ఎత్తిపోతల పథకం నుండి సాగు భూముల చివరి ఆయకట్టు వరకు పంట సాగుకు అవసరమైన నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరం అయిన నీటిని ప్రణాళిక బద్ధంగా విడుదల చేయడం జరుగుతుందని, ఈ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం సాగు సకాలంలో ప్రారంభించాలని, ఆలస్యంగా సాగు చేయడం వలన ఇబ్బందులు ఎదురవుతాయని, సాగుకు అవసరమైన నీటిని సకాలంలో అందిస్తామని వెల్లడించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20 టి ఎం సి ల నీరు ఉందని, కార్యచరణ ప్రకారం సాగునీరు, త్రాగునీటికి వినియోగించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా పైప్ లైన్ల మరమ్మత్తులను చేపట్టి పనులు పూర్తి చేసి సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో భారీ దొంగతనానికి చెక్

- దేశం చుట్టిన దొంగ అరెస్ట్, పలు రాష్ట్రాలలో కేసులు
- షాద్ నగర్ లో కూడా భారీ చోరీ, తాళం వేసి ఉన్న ఇండ్లే టార్గెట్




**షాద్ నగర్. మహా:** ఒక ఊరు కాదు.. ఒక రాష్ట్రం కాదు.. మొత్తం దేశాన్నే చుట్టాడు.. పలు రాష్ట్రాలలో తాళం వేసి ఉన్న ఇళ్ళనే టార్గెట్ చేశాడు.. సుమారు 300 ఇళ్లలో దొంగతనాలు చేసి రికార్డు సృష్టించాడు.. అదే తరహాలో షాద్ నగర్ ను కూడా టార్గెట్ చేసి ఇక్కడి పోలీసుల వలలో చిక్కాడు.. మహారాష్ట్రలోని పండరీపూర్ కు చెందిన ఓ దొంగ కథకు షాద్ నగర్ పోలీసులు మొత్తానికి తెరదించారు. దొంగ ప్రవర్తన, నడిచే స్టైల్ చూసి మన పోలీసులు ఇట్టే పట్టేశారు. ఫ్యూచర్ సిటీ నూతన కమిషనరేట్ కార్యాలయ పరిధిలో భారీ దొంగతనానికి స్థానిక పోలీసులు చెక్ పెట్టడం విశేషం. షాద్ నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని పండరీపురం ప్రాంతానికి చెందిన అశోక్ కులకర్ణి అలియాస్ సచిన్ తల్లిదండ్రులు లేని అనాథ. తన 12 ఏళ్ల వయసు నుంచి దొంగతనాలు చేస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. ఆ సమయంలో పోలీసులకు చిక్కి పోస్టల్ స్కూల్లో విద్యను అభ్యసించాడు. తరువాత కాలంలో బెల్గావ్ సెంట్రల్ జైల్లో ఏడు సంవత్సరాల జైలు శిక్షణ అనుభవించాడు. తాళాలు వేసి ఉన్న ఇండ్లే ఇతని టార్గెట్. అలా తెలంగాణతో పాటు కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కలిపి 300 కు పైగా దొంగతనాలు చేశాడు. పలుచోట్ల ఇతనిపై కేసులు నమోదయ్యాయి. ఇక్కడ మాత్రమే కాదు శంషాబాద్, మహబూబ్ నగర్లలో కూడా ఇతనిపైన కేసులు ఉన్నాయి. ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి మారుతూ దొంగతనాలు చేస్తున్న ఇతను పోలీసులకు మింగుడు పడేని సరుకుగా మారాడు. అందుకే ఎన్ని దొంగతనాలు చేసినా ఎక్కడ కూడా ఇతను పట్టు పడలేదు.. ఇక వర్తమానం లోకి వస్తే.. గత ఏడాది డిసెంబర్ 20వ తేదీన పట్టణంలో నివాసముండే ఉన్నాడా అశోక్ గౌడ్ ఇంటికి తాళం వేసి తమ అత్తగారి ఇంటికి వెళ్లి 23వ తేదీ రోజున ఇంటికి తిరిగివచ్చాడు. వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టబడి ఉంది. బీరువాలో ఐదు లక్షల నగదు, బంగారం, వెండి మాయం అయ్యాయి. దీనిపై అతను పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ మొదలైంది. డిఐ వెంకటేశ్వర్లు, శివారెడ్డి సీసీ ఫుటేజ్ ల ఆధారంగా ఇతను జాతీయస్థాయి దొంగని గుర్తించారు. విచారణ మొదలుపెట్టారు. చివరికి ఇతని స్వస్థలం మహారాష్ట్రలోని పండరిపూర్ అని గుర్తించారు. ఇతను ఢిల్లీలో ఉన్నట్లుగా తెలుసుకొని చాకచక్యంగా ఇతని పట్టుకున్నారు. ఇతని వద్ద బంగారు గొలుసు, రెండు చెవి కమ్మలు, మూడు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో విచారణ జరిపి ఇతడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను సీఐ విజయ్ కుమార్ అభినందించారు.



# ఖానాపూర్ లో ఘనంగా ముగ్గుల పోటీలు

## బహుమతులు ప్రధానం చేసిన అభిషేక్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఖానాపూర్ సీతా రామాంజనేయ స్వామి దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు అద్భుతంగా వేయడం జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఈ యొక్క పోటీలలో విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. వీరితో పాటుగా ముగ్గుల పోటీలో పాల్గొన్న వారందరికీ, ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున, నిర్వాహకులు ఇవ్వడం జరిగింది. సంక్రాంతి పండుగ అంటేనే సందడి పండుగ సందర్భంగా మహిళలు ఈ యొక్క ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన ముగ్గులు వేయడం జరిగిందని, ఈ యొక్క ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు, చిన్నారులకు, గ్రామ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందని అభిషేక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, డైరెక్టర్లు దొంతరమోని రాజు, సుబ్బుర్ మల్లిక, పాండు, మంకాల దాసు, డొంకిని శ్రీనివాస్ గౌడ్, డి రాములు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కొరటా చెనకా ప్రాజెక్టుకు సీఆర్ఆర్ పేరు

## కంది శ్రీనివాస రెడ్డి హర్షం- సీఎంకు మంత్రులకు ధన్యవాదాలు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో ఉన్న కొరటా చెనకా ప్రాజెక్టుకు మాజీ మంత్రివర్యులు స్వర్గీయ చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు పెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం ,జిల్లా ప్రజల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేసిన చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు సూచించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి కంది శ్రీనివాస రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం




- యువత క్రీడలపై దృష్టి పెట్టాలి
- రావిచేడ్ గ్రామ సర్పంచ్ గోపాల్..

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెంపొందుతుందని, జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు. కడ్తాల్ మండలం, రావిచేడ్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన, ఆర్పిఎల్ ప్రీమియర్ లీగ్ 6 క్రికెట్ టోర్నమెంట్ గురువారం సాయంత్రం ముగిసింది. మొదటి బహుమతి గెలుపొందిన శశికాంత్ టీంకు రూ. 30 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. సెల్ ఫోన్లలో ఆటలు ఆడకుండా ఫిజికల్ గా పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ముగించుకున్న సందర్భంగా నిర్వహకులకు అభినందనలు తెలిపారు. యువత చైతన్య వంతగా ఉండాలన్నారు. భవిషత్తు యువతదే కాబట్టి మద్యపానానికి, మాదకద్రవ్యాలకు వ్యతి రేకంగా కంకణం కట్టుకోవాలని సూచించారు. అదే విధంగా యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు రవికుమార్, భూపతి, రామస్వామి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, నాయకులు బాలకృష్ణ, లింగం, జమీర్, పవన్ కుమార్, రమేష్, శ్రీశైలం, నరసింహ, యాదయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక 06
తెలుగు
శనివారం, హైదరాబాద్ | 17-01-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

# ఘనంగా షబ్-ఏ-మేరాజ్



**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల,మాడ్గుల,మండలాల్లోని ఆయా గ్రామాల్లో షబ్ఎమేరాజ్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం రాత్రి జాగరణ చేశారు. ఇస్లాం ధర్మంలో అత్యంత పవిత్ర మైన ఘనమైన రాత్రి షబ్ ఎ మేరాజ్ కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు.ఈ పవిత్ర రాత్రి ముస్లిం సోదరులు జాగారం చేస్తూ ప్రత్యేక ప్రార్థనలలో నిమగ్నమై అల్లహ్ కృప కోసం దువా చేశారు. మత పెద్దలు ఖురాన్ వెలుగులో జీవితాన్ని పాటించాల్సిన విధి విధానాలను వివరించారు..పండుగ వాతావరణం నేపథ్యంలో మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయా మసీదులలో రాత్రి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు మౌలానా లు బయాన్ నిర్వహించారు. ఆయా మసీదులలో వివిధ మౌలానా లు మాట్లాడుతూ అల్లా చెప్పిన దైవ దారిన నడిచి పరుల హితం కోరుకోవాలన్నారు.షబ్ ఎ మేరాజ్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయా మసీదులలో దువా జాగరణ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర విపత్తు నివారణ బృందం విస్తృత పర్యటన

- జరిగిన నష్టం, నివారణ చర్యల పై కేంద్ర బృందం ఆరా
- పర్యటనలో జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్, అధికారులు



**వరంగల్ హన్మకొండ మహా;** అక్టోబర్ నెలలో సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా ఎన్నడూ లేనివిధంగా వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలు, ముంపు ప్రాంతాల తో పాటు ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, నగరంలోని పలు కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకొని అపార ఆస్తి నష్టం జరిగింది. తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జరిగిన నష్టం అంచనా వేసేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ప్రభుత్వం నుండి విపత్తు నివారణ బృందం శుక్రవారం వరంగల్ జిల్లాతో పాటు వరంగల్ నగరం జిడబ్ల్యు ఎంసి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. నలుగురు ప్రతినిధులు పొన్ను స్వామి, నిశాంత్ మిశ్రా, శశివర్ధన్, రాహుల్ బఖేటి లతో కూడిన కేంద్ర బృందం తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యు ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయి వరంగల్ నగరంలోని ఎన్ఎన్ నగర్, ఎన్టీఆర్ నగర్, మైసయ్య నగర్ , కాలనిలలో పర్యటించి క్షేత్ర స్థాయిలో నీట మునిగిన ఇండ్లు, గృహాలకు వాటిల్లిన నష్టం, వాహనాలు, ఇంటి సామగ్రి నష్టం, నీటి మునిగిన ట్రాన్స్ఫార్మర్స్, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కిన ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి అక్కడ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు, స్థానికులను తుఫాను వల్ల జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని చంద్రుగొండ, బొగ్గులకుంట తండా, దీక్ష కుంట గ్రామాల్లో తుఫాను ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో ధ్వంసమైన రోడ్లు కల్వర్టులు, బ్రిడ్జిలకు వాటిల్లిన నష్టం, నీట మునిగిన వరి పంట, దెబ్బతిన్న పంట పొలాలు పశువుల నష్టం, దీక్ష కుంటలో కూలిన ప్రభుత్వ పాఠశాల భవనం లను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. తుఫాను వల్ల వాటిల్లిన పంట నష్టం గురించి కేంద్ర బృందానికి స్థానిక రైతులు వివరించారు.

**అపార నష్టం బాధితులకు అందని నష్టపరిహారం**

మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారంగా 15000 ప్రకటించినప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించకపోవడం అలాగే సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే అసలైన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా 28వ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఎన్టీఆర్ నగర్ బృందావన్ కాలనీ, తో పాటు ఎన్ ఎన్ నగర్, సమ్మయ్య నగర్ నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని కాలనీ వాసులకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని కేంద్ర బృందానికి చెప్పినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, ఎన్ పిడిసిఎల్ ఎస్ ఈ గౌతమ్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ,జిల్లా పశు సంవర్ధక అధికారి బాలరాజు, ఆర్డీఓ సుమా, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి, జిడబ్ల్యు ఎంసీ ఎస్ ఈ సత్యనారాయణ, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం సర్పంచ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల అవగాహన సదస్సు



**మహా, పరకాల :** హనుమకొండ జిల్లా, పరకాల మండలం, నాగారం గ్రామం లో సర్పంచ్ ఏరుకొండ. రమాదేవి శ్రీనివాస్ అధ్యక్షతన,ఉపసర్పంచ్ ఏ. రజనీకర్,పాలక వర్గం సమక్షంలో, మన సమాజంలో జరుగుతున్న నేరాలు, ఇప్పుడు ప్రస్తుతం జరుగుతున్నా సైబర్ నేరాల గూర్చి "మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఎందుకు ఎన్ జీ వో"ఆధ్వర్యంలో బండారి. విష్ణు , చాలా గొప్పగా ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో, వాటి బారిన పడకుండా, పలు వక్తలు తమ యొక్క అభిప్రాయాన్ని ప్రజలకు, యువతకు తగు సూచనలు, జాగ్రత్తలు, వాటి నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో సూచించండం జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏరుకొండ.శ్రీనివాస్, ఏ. సంతోష్, బోడ. సునీల్, పీ. వినయ్ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియచేస్తూ, ఏ. శ్రీనివాస్, సాగర్ సమక్షంలో త్వరలో మన గ్రామ పంచాయతీ లో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని, అలాగే చదువుకునే ప్రతీ విద్యార్థులకు మా వంతు సహకారం అందిస్తామని, ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో ముందుకు తీసుకువస్తామని, సర్పంచ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, పాలక వర్గం, గ్రామ పంచాయతీ సిబ్బంది, సెక్రటరీ, యువతకు, అన్ని రకాల సహాయం అందిస్తామని సూచించడం జరిగింది.

# సురక్షిత ప్రయాణంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకం

**మేడారం జాతర వేళ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి.. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




**వరంగల్ హన్మకొండ మహా;** ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమైందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన ''అరైవ్..అలైవ్'' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ విభాగం అధ్వర్యంలో హన్మకొండ సిటి డిపోలో రోడ్డు ప్రమాదాలపై ఆర్టీసీ ఉద్యోగులకు పోలీస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకోవాల్సిన ముందస్తూ జాగ్రత్త చర్యలతో పాటు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు చేకూడని పనులపై ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆర్టీసీ ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారింది. దీని కారణంతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో ఆకాల మరణం పొందటం కారణంగా కొన్ని కుటుంబాలు రోడ్డు పడ్డాయని, ఆర్టీసీ విషయంలో డ్రైవర్ల విధుల్లో చేరే ముందు వారిని వివిధ రకాలుగా పరిక్షలు చేపట్టడం అనంతరం వారిని విధుల్లో తీసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, ఇటీవల ఆర్టీసీకి సంబంధించి రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులందరికి అభినందనలు తెలిపారు. ఎప్పుడైన రాత్రి సమయాల్లో బస్ బ్రెక్ డౌన్ అయితే బస్సు వేనుక భాగంలో రెడియం స్టికర్ వుండే విధంగా జాగ్రత్త పడాలని, రాబోయే మేడారం జాతర సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు రాకుండా వుండేందుకు రోడ్ల పై బస్సులను నిలిపివేయవద్దని పోలీస్ డ్రైవర్లకు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేసారు. అనంతరం సుదీర్ఘ కాలంగా డ్రైవర్‌గా పనిచేస్తూ ఎలాంటి బస్సులను ప్రమాదాలకు గురికాకుండా విధులు నిర్వహించిన డ్రైవర్లను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత, ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్, రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, డిప్యూటీ రిజినల్ మేనేజర్ భానుకిరణ్, డిపో మేనేజర్ ధర్మంసింగ్, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ పాల్గొన్నారు.



# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర బృందం

**వరంగల్ మహా;** ఢిల్లీ నుండి వచ్చిన జాతీయ విపత్తు నివారణ కమిటీ బృందం ఓరుగల్లు శ్రీ భద్రకాళి అమ్మవారిని శుక్రవారం అధ్యక్షులు గయా ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ తో కలిసి వారి బృందం డాక్టర్ పొన్ను స్వామి, బైరి శ్రీనివాసు, ఎస్.ఎస్. పింటో, వనీత, నిశాంత్ మిశ్రా, రాహుల్, శశివర్ధన్ తదితరులు దర్శించుకున్నారు. మొదట ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ ఈ ఓ రామల సునీత, ధర్మకర్త తొనుపునూరి వీరన్న దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్.డి.ఓ, తహశీల్దార్ తదితరులున్నారు. అనంతరం భూపాలపల్లి ఏసిపి సంపత్ రావు తదితరులు అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శుక్రవారం కావటంతో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేశారు.

# ధరణి,భూభారతి రిజిస్ట్రేషన్ల కుంభకోణంలో 15 మంది నిందితులు అరెస్ట్



- ముఠాలోని మరో 9 మంది నిందితులు పరారీ
- భారీగా నగదు, ఆస్తి పత్రాలు, కారు, లాప్టాప్ లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- కేసు పూర్తి వివరాలు వెల్లడించిన వరంగల్ సీపి

**హన్మకొండ, జనగామ మహా;** రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నవి 63.19 లక్షల నగదు, బ్యాంక్లో 1లక్ష రూపాయలు, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్లు, ఐదు డెస్క్ టాప్ ల తో పాటు కంప్యూటర్లు,17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు**

పసునూరి బసవ రాజు, వయసు 32 సంవత్సరాలు యాదాద్రి జిల్లా, జెల్లా పాండ, వయసు 46 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా, మహేశ్వరం గణేష్ కుమార్, వయసు 39 స.లు ఇయాదాద్రి జిల్లా, ఈగజులపాటి శ్రీనాథ్ వయసు 35 సంవత్సరాలు, జనగామ, యెనగంధుల వెంకటేష్, జనగామ, కోదురి శ్రావణ్ వయసు 35 సంవత్సరాలు, జనగామ, కొలిపాక సతీష్‌కుమార్ వయసు 36సంవత్సరాలు, కొడకండ్ల (ఎం), జనగామ, తడూరి రంజిత్ కుమార్ వయసు 39 సంవత్సరాలు, నర్మెట్ట, జనగామ, దుంపల కిషన్ రెడ్డి, వయసు 29 సంవత్సరాలు, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, దశరథ మేఘావత్ వయసు 28 సంవత్సరాలుతురుపల్లి, నారా భాను ప్రసాద్, వయసు 30 సంవత్సరాలు, యాదగిరి గుట్ట, గొపగాను శ్రీనాథ్, వయసు 32 సంవత్సరాలు, శివ కుమార్, వయస్సు 33, అమంగల్, నల్లగొండ, అలేటి నాగరాజు, వయస్సు 32, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్కిప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయి. ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ ముఠా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏ. ఎస్పీ పందరి చేతన్. జనగామ ఇన్స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.



# జరిగిన నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పిస్తాం

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ గయా ప్రసాద్.. జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో కేంద్ర బృందం సమీక్షా సమావేశం**




**వరంగల్ హన్మకొండ మహా ;** హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మొంథా తుపాన్ కారణంగా భారీ వర్షాలతో వివిధ పంటలు, ఆస్తి, చెరువులు కాలువలకు వాటిల్లిన నష్టాలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించామని, పూర్తి స్థాయి వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి సమర్పించనున్నట్లు కేంద్ర అధికారుల బృందం కమిటీ నేతృత్వం వహించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ గయా ప్రసాద్ తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందం, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై నష్ట వివరాలు, నివేదికలను సమీక్షించింది. ఈ బృందాలు తుఫాను, వరదల వల్ల దెబ్బతిన్న పంటలు, ఆస్తి నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మొంథా తుపాను ప్రభావం కారణంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఏర్పడిన వివిధ పంటలు, ఆస్తి, ప్రాణ నష్టం పరిస్థితులపై సమీక్షా సమావేశం హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (అంతర్ శాఖల కేంద్ర బృందం) సమీక్షించారు. ముందుగా హనుమకొండ వరంగల్ జిల్లాలతో పాటు గ్రేటర్ వరంగల్ నగరంలో భారీ వర్షాలతో వాటిల్లిన పంట, ఆస్తి నష్టాలతో పాటు సహాయక చర్యలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఎమ్మెల్యేలతో వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటన, మరమ్మతు పనులు పూర్తి చేసిన వివరాలను తెలుపుతూ ఐడిఓసి లో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను కేంద్ర బృందం వాటిని తిలకించారు. ఆయా ఫోటోలకు సంబంధించిన వివరాలను కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద కేంద్ర బృందానికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, వరద నష్టం పై అంచనా కోసం నియమించిన కేంద్ర అధికారుల బృందం కమిటీకి నేతృత్వం వహించిన గయ ప్రసాద్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పంటలు, ఆస్తి, ప్రాణ నష్టాలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర వివరాలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందజేయాలన్నారు.

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో జరిగిన నష్టం గురించి కేంద్ర బృందానికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో 378, 318 మిల్లి మీటర్ల వర్షం కురిసిందని, వరంగల్ పట్టణంలోని ఖిలా వరంగల్, వరంగల్ మండలాల్లో 368, 271 మిల్లీమీటర్ల భారీ వర్షం కురిసిందన్నారు.78 ప్రాంతాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోని వరంగల్ జిల్లాకు సంబంధించిన 35 ప్రాంతాలు, జలామయమయ్యాయని, 8 పునరావాస కేంద్రాలకు 1170 బాధితులకు తలలించామని జరిగిందన్నారు. జిల్లాలో పంట నష్టం, ఇతర నష్టం మొత్తం కలిపి 181.54 కోట్ల రూపాయల నష్టం జరిగినట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. తుఫాను వల్ల జిల్లాలో 7986.98 హెక్టార్లలో సుమారు రూ.13.04 కోట్ల అంచనా పంటకు నష్టం వాటిలిందన్నారు. రోడ్ల భవనాల శాఖకు చెందిన కోటి 32 లక్షల అంచనా విలువగల 104 కిలోమీటర్ల రోడ్డు, 32 కల్వర్టులు, బ్రిడ్జిలకు నష్టం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు చెందిన 29 రోడ్లు, 8 కిలోమీటర్ల రోడ్డు ఉపరితలం 16 కల్వర్టులు, రూ 16.25 కోట్ల విలువ గల బ్రిడ్జిలు ధ్వంసం అయ్యాయని అన్నారు. విద్యుత్ శాఖకు చెందిన రూ 3 కోట్ల 14 లక్షల దెబ్బతిన్న స్తంభాలు, కాండక్టర్లు, ట్రాన్స్ఫార్మర్స్ లకు నష్టం జరిగిందన్నారు. 9 మండలల్లోని దెబ్బతిన్న 32 పాఠశాలల విలువ రూ1.80 కోట్లు అని అన్నారు. నష్టం జరిగిన మధ్య, తరహా,చిన్ననీటి పారుదల వనరుల పునరుద్ధరణ కు రూ 21.58 కోట్లు అవసరమని అన్నారు. దెబ్బతిన్న కమ్యూనిటీ సెంటర్స్, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు రూ 2కోట్ల 41 లక్షలు అవసరమని అన్నారు.

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ**

జిల్లాలో 229.6ఎంఎం వర్షపాతం కురిసిందని దీంతో వరి పంటతోపాటు పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు భారీ వర్షానికి దెబ్బతిన్నాయని తెలియజేశారు. వరదలతో ఒకరు మృతి చెందారని, పశు సంపద 10072 నష్టం జరిగిందని, వరి పంట 33,348 ఎకరాలు, పత్తి 750 ఎకరాలు, మొక్కజొన్న 650 ఎకరాల్లో పంట దెబ్బతిన్నాయని అన్నారు. పలుచోట్ల ఇండ్లకు నష్టం జరిగిందన్నారు. భారీ వర్షం కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీట మునిగిన ఇండ్లు, విద్యాసంస్థల నుండి ప్రజలు, విద్యార్థులను సురక్షితంగా పునరావాస కేంద్రాలు, ఇతర విద్యాసంస్థలకు తరలించినట్లు తెలియజేశారు. హనుమకొండ మండల పరిధిలో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన నష్టం పై సర్వే పూర్తి చేశామని, 41 కాలనీల్లో బాధితులను గుర్తించామని, ప్రతి బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 15వేల చొప్పున ఐదు కోట్ల 23 లక్షల 95 వేల రూపాయలను నేరుగా బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా అందించామని వివరించారు.

**జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ వాజ్పాయ్**

గ్రేటర్ వరంగల్ లో భారీ వర్షాలకు జరిగిన నష్టం వివరాలను తెలుపుతూ వరంగల్ నగరంలోని కిలా వరంగల్ వరంగల్ ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదయినందువల్ల మూడు ప్రధాన చెరువుల నుండి వరద నీటితో పాటు సమీపంలోగల ఎలుగురు రంగంపేట చెరువు వరదనీరు చేరుకోవడం వల్ల వరంగల్ మహానగరంలోని 78 కాలనీలు నీట మునిగాయన్నారు 1560 మంది వరద బాధితులకు 45 కేంద్రాలకు సురక్షితంగా తరలించి వారికి నిత్యవసరలను అందించడం జరిగిందన్నారు నగరంలోని ఎనిమిది ట్రాఫిక్ జంక్షన్ లకు అంతరాయం కలిగిందన్నారు. ముంపునకు గురైన కాలనీలో చేపట్టిన సహాయక చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారుల బృందానికి వివరించారు.

# కాంగ్రెస్ లో భారీ చేరికలు


**ప్రజా ప్రభుత్వం పై నమ్మకమే చేరికలకు నిదర్శనం.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఎండి అయూబ్**



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి యువకులు, కార్యకర్తలు, మహిళలు కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మహమ్మద్ అయూబ్ పాల్గొని వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాహిత కార్యక్రమాల పై విశ్వాసం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జిల్లా అధ్యక్షులు అయూబ్ పార్టీలో చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ**

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నందుకే ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి ఇంత ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గంతో పాటు గ్రేటర్ వరంగల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఇండిగో బాధితులకు రిఫండ్ పూర్తి

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. డిసెంబర్ 35 మధ్య విమాన రద్దు వల్ల ప్రభావితమైన ప్రయాణికులందరికీ రిఫండ్ ప్రాసెస్ చేసిందని ఏవియేషన్ సేఫ్టీ రెగ్యులేటర్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) తాజాగా తెలిపింది. 'డిసెంబర్ 35 వరకు కార్యకలాపాల అంతరాయాల కారణంగా బాధిత ప్రయాణీకులకు అందించే రిఫండ్‌లు, పరిహారాలకు సంబంధించి దేశీయ క్యారియర్ ఇండిగోతో డీజీసీఏ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది' అని డీజీసీఏ పేర్కొంది. డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 5 వరకు ఇండిగో విమానాల రద్దుకు సంబంధించి అన్ని రిఫండ్లను పూర్తిగా ప్రాసెస్ చేసి, చెల్లింపులు క్లియర్ చేసినట్లు ఇండిగో తెలియజేసిందని వివరించింది. అంతేకాకుండా ఎక్కువ అసౌకర్యం ఎదుర్కొన్న ప్రయాణీకులకు ఊరట కల్పించడానికి అదనపు చర్యగా విమానయాన సంస్థ "గెస్చర్ ఆఫ్ కేర్' పేరుతో ఒక్కొక్కరికీ రెండు రూ.5,000 ట్రావెల్ వోచర్లను అందించినట్లుగా తెలిపింది. వీటికి 12 నెలల చెల్లుబాటు ఉంటుందని, ఆయా తేదీల్లో ఫ్లైట్లు రద్దవడం లేదా మూడు గంటల కంటే ఆలస్యంతో ఇబ్బందులు పడిన ప్రయాణికులకు వీటిని అందించినట్లుగా పేర్కొంది. బాధిత ప్రయాణికులకు రిఫండ్ పూర్తయినట్లు ఇండిగో, డీజీసీఏ చెబుతుంటే మరో వైపు తమకు రిఫండ్ అందలేదని చాలా మంది ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇండిగోను, డీజీసీఏ ట్యాగ్ చేస్తూ పోస్టులు చేస్తున్నారు.




# అంబానీ సామ్రాజ్యం స్థిరం

- క్యూ3లో రిలయన్స్ మిక్స్‌డ్ ఫ్లేవర్
- జియో జోరు, రిటైల్ రికార్డులు
- ప్రాఫిట్ రూ. 18,645 కోట్లు
- ఆదాయం రూ. 2.69 లక్షల కోట్లు
- రూ. 221కు జియో ఏఆర్‌పీయూ
- కొత్తగా 431 రిలయన్స్ రిటైల్ స్టోర్లు

**న్యూఢిల్లీ:** డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం ఫ్లాట్‌గా రూ. 18,645 కోట్లను తాకింది. ఇతర విభాగాలు పుంజుకున్నప్పటికీ గ్యాస్ ఉత్పత్తి క్షీణించడం, రిటైల్ బిజినెస్ నీరసించడం ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 18,540 కోట్లు ఆర్జించింది. కన్జూమర్ బిజినెస్ విడదీత, జీఎస్‌టీ క్రమబద్ధీకరణ నేపథ్యంలో రిటైల్ బిజినెస్ ఆర్జన మందగించగా.. ఎనర్జీ, డిజిటల్ విభాగాలు మెరుగైన మార్జిన్లు సాధించాయి. కాగా.. మొత్తం ఆదాయం రూ. 2.43 లక్షల కోట్ల నుంచి రూ. 2.69 లక్షల కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 6 శాతం వృద్ధితో రూ. 48,003 కోట్లకు చేరింది.

**విభాగాల వారీగా**

రిలయన్స్ రిటైల్ నికర లాభం 3 శాతం పుంజుకుని రూ. 3,551 కోట్లను తాకింది. కొత్తగా 431 స్టోర్లను ప్రారంభించింది. ఆదాయం 8 శాతం ఎగసి రూ. 97,605 కోట్లకు చేరింది. జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 7,629 కోట్లకు చేరింది. త్రైమాసికవారీగా కస్టమర్ల సంఖ్య 50.64కోట్ల నుంచి 51.53 కోట్లకు పెరిగింది. ఒక్కో వినియోగదారుని పై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 213.7 నుంచి రూ. 221.4కు బలపడింది. కేజీ ఫీల్డ్స్‌లో ఉత్పత్తి తగ్గడంతో ఇబిటా 13 శాతం క్షీణించి రూ. 4,857 కోట్లకు పరిమితమైంది. కేజీడీ 6లో సగటున గ్యాస్ ఉత్పత్తి 26.1 ఎంఎస్‌సీఎండీకి చేరగా.. రోజుకి 18,400 బ్యారళ్ల చమురును వెలికితీసింది. జియోస్టార్ రూ. 8,010 కోట్ల ఆదాయం సాధించింది. ఇబిటా రూ. 1,303 కోట్లుకాగా.. యాక్టివ్ యూజర్ల సంఖ్య 13 శాతం వృద్ధితో నెలవారీ 45 కోట్లను తాకింది. 2025 డిసెంబర్31కల్లా ఆర్ఐఎల్ నికర రుణ భారం రూ. 1.17 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో రూ. 33,286 కోట్ల పెట్టుబడి వ్యయాలను కవర్ చేసేలా రూ. 41,303 కోట్ల నగదు ఆర్జన సాధించింది. ఆర్ఐఎల్ షేరు ఫ్లాట్‌గా రూ.1,458 వద్ద ముగిసింది.

**ఓ2సీ, న్యూ ఎనర్జీపై దృష్టి**

ఓ2సీ, న్యూ ఎనర్జీ బిజినెస్‌లలో వృద్ధికి వీలుగా ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులపై పెట్టుబడులను వెచ్చిస్తున్నాం. అంతేకాకుండా జియో, రిటైల్ నెట్‌వర్క్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణ, పటిష్టతలకు పెట్టుబడి వ్యయాలను కేటాయిస్తున్నాం. వివిధ విభాగాలలో నిలకడైన ఆర్థిక పనితీరు, నిర్వహణ సామర్థ్యాలను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి.

# విప్రోకు కార్మిక చట్టాల సెగ




**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం విప్రో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 3,119 కోట్లకు పరిమితమైంది. కొత్త కార్మిక చట్టాల అమలు నేపథ్యంలో చేపట్టిన రూ. 303 కోట్ల వన్‌టైమ్ కేటాయింపులు ప్రభావం చూపాయి. అంతేకాకుండా పునర్వ్యవస్థీకరణ పూర్తికావడంతో మరో రూ. 263 కోట్ల వ్యయాలు సైతం లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 3,354 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం 6 శాతం ఎగసి రూ. 23,556 కోట్లకు చేరింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 4 శాతం నీరసించగా.. ఆదాయం 4 శాతం పుంజుకుంది. ఈ నెల 27 రికార్డ్ డేట్‌తో వాటాదారులకు షేరుకి రూ. 6 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

**వృద్ధి ఓకే**

విప్రో తాజాగా ఐటీ సర్వీసుల నుంచి పూర్తి ఏడాదికి 0-2 శాతం వృద్ధితో 263.5-268.8 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జించగలమని అంచనా వేసింది. ఏఐ వ్యూహాత్మకంగా కీలక పాత్ర పోషిస్తున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ శ్రీని పాలియా తెలియజేశారు. వెరసి డీల్స్ గెలుచుకోవడంలో విప్రో ఇంటెలిజెన్స్ ప్రత్యేకతను చాటుకుంటున్నట్లు వెల్లడించారు.


**ఇతర విశేషాలు**

క్యూ3లో 6 శాతం తక్కువగా 3.3 బిలియన్ డాలర్ల(రూ. 29,700 కోట్లు) విలువైన డీల్స్ కుదుర్చుకుంది. 6,529 మంది ఉద్యోగులను జత కలుపుకుంది. మొత్తం సిబ్బంది సంఖ్య 2,42,021ను తాకింది. తాజాగా 400 మంది ఫ్రెషర్స్(ఇప్పటివరకూ 5,000మంది)కి ఉపాధి కల్పించింది. తద్వారా ఈ ఏడాది చివరికి 8,000 మందిని తీసుకునే వీలున్నట్లు తెలియజేసింది.

# టెక్ మహీంద్రా లాభం అప్

ముంబై: ఐటీ సర్వీసుల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం వార్షికంగా 14 శాతం ఎగసి రూ. 1,122 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 983 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)లో నమోదైన రూ. 1,194 కోట్లతో పోలిస్తే క్యూ3 నికర లాభం నీరసించింది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 13,286 కోట్ల నుంచి రూ. 14,393 కోట్లకు బలపడింది. ఈ క్యూ2లో సాధించిన రూ. 13,994 కోట్లతో చూసినా టర్నోవర్ పెరిగింది. నిర్వహణ లాభ మార్జిన్లు 2.9 శాతం మెరుగుపడి 13.1 శాతాన్ని తాకాయి. అయితే కొత్త కార్మిక చట్టాల కారణంగా మార్జిన్లపై 0.2 శాతం ప్రతికూల ప్రభావం పడినట్లు కంపెనీ సీఎఫ్‌వో రోహిత్ ఆనంద్ పేర్కొన్నారు. ఇందుకు 3 కోట్ల డాలర్లు(రూ. 270 కోట్లు) కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కాలంలో కొత్తగా 1.096 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు పొందింది. ఇవి 47 శాతం అధికంకాగా.. 2025 డిసెంబర్ 31 కల్లా సిబ్బంది సంఖ్య 872 తగ్గి 1,49,616కు పరిమితమైంది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 12.3 శాతంగా నమోదైంది. నగదు, తత్సమాన నిల్వల విలువ రూ. 7,666 కోట్లకు చేరింది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# పాక్‌ను అడ్డుకోవాల్సిందే.. ఐరాసను దుర్వినియోగం చేస్తోంది : భారత్



**మహా:** విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. ఐరాస ఛార్టర్ ప్రకారం లభించిన స్వీయ నిర్ణయ హక్కును పాక్ దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామిక దేశాల్లో విభజనవాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్‌ను నిరోధించాలని కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సెలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. 2025లో ఐరాస కార్యకలాపాలపై సెక్రెటరీ జనరల్ విడుదల చేసిన వార్షిక నివేదికపై అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న ఐరాస జనరల్ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మ్యాథ్యూ పున్నూస్ ప్రసంగించారు. ప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోందని మ్యాథ్యూ పున్నూస్ మండిపడ్డారు. భారత్‌లో ఒక భాగమైన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీరు గురించి మాట్లాడేందుకు ఐరాసను పాక్ వేదికగా చేసుకోవడం సరికాదన్నారు. మరో దేశానికి చెందిన భూభాగం గురించి మాట్లాడే హక్కు మున్మాటికీ పాక్‌కు లేదన్నారు. 1948 ఏప్రిల్ 21న ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానం ప్రకారం జమ్మూకశ్మీరు నుంచి సేనలను పాక్ వెనక్కి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాటి నుంచి జమ్మూకశ్మీరు ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికలలో ఓట్లు వేస్తూ, తమ ప్రతినిధులను చట్టసభలకు పంపుతున్నారని మ్యాథ్యూ పున్నూస్ తెలిపారు. ఈవిధంగా తాము భారతదేశ పక్షమే అనే సందేశాన్ని జమ్మూకశ్మీరు ప్రజలు ఇచ్చారని స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టులో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

## ఇంకెంత కాలం ప్రశ్నిస్తారన్న సర్వోన్నత న్యాయస్థానం మార్చి 10కి విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, మహా :** సంచలనవ సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభాకర్‌రావు ఇంటరాగేషన్ ఇంకెంతకాలం కొనసాగిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటికే ఆయన్ను రెండు వారాలకు కస్టడీకి అనుమతించామని, ఇంకా అదనపు విచారణ అవసరంలేదని వ్యాఖ్యానించింది. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరఫున లాయర్ సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. దీంతో ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయన్ని పిలవకుండా ఉండలేరు కదా..? మీ పర్పస్ పూర్తయిందా లేదా? ప్రభాకర్‌రావును మళ్లీ జైల్లో పెట్టాలనుకుంటున్నారా..? అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. అయితే ఈ కేసు దర్యాప్తులో న్యాయపరమైన అంశాలు ముడిపడి ఉన్నాయని, ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను మార్చి 10వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.



# ట్రంప్‌తో మచాడో భేటీ

## నోబెల్ పురస్కారం అందజేత.. వెనిజులా భవిష్యత్‌పై చర్చ

**మహా:** వెనిజులా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వెనిజులా విపక్ష నేత మరియా కోరినా మచాడో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రంప్-మచాడో భేటీతో వెనెజువెలా భవిష్యత్‌పై కొత్త చర్చలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా మచాడో తనకు లభించిన నోబెల్ శాంతి పురస్కారాన్ని ట్రంప్‌నకు అందజేశారు. వెనిజులా ప్రజల స్వేచ్ఛ, దేశ సంక్షేమం కోసం ట్రంప్ చేస్తున్న కృషికి గౌరవ సూచకంగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైట్‌హౌస్ నుంచి బయటకు వచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన మచాడో, "వెనిజులా స్వేచ్ఛ కోసం మేం అధ్యక్షుడు ట్రంప్‌పై ఆధారపడుతున్నాం. మా దేశ ప్రజల ఆశలు ఆయనపై ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు.

# జంతువులా ఈడ్చుకెళ్లారు

- అమెరికాలో పౌరురాలి పట్ల ఇమిగ్రేషన్ అధికారుల అమానవీయ ప్రవర్తన
- కారులో ఆసుపత్రికి వెళ్తుండగా బలవంతంగా బయటకు లాగి అరెస్టు

**వాషింగ్టన్:** అమెరికాలో ఒక మహిళను ఇమిగ్రేషన్ అధికారులు కారులోనుంచి బలవంతంగా బయటకు లాగి అరెస్టు చేసి, చేతులు పట్టుకొని బరబరా ఈడ్చుకెళ్లడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన పట్ల అధికారులు దారుణంగా ప్రవర్తించారని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. అలియా రెహ్మాన్(42) అమెరికా పౌరురాలు. ఇక్కడే జన్మించారు. మిన్నెపొలిస్ నగరంలో నివసిస్తున్నారు. చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ సెంటర్‌లో చికిత్స కోసం ముందే అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. మంగళవారం కారులో అక్కడికి బయలుదేరారు. మధ్యలో ముఖాలకు మాస్క్‌లు ధరించిన ఇమిగ్రేషన్ ఏజెంట్లు అడ్డుకున్నారు. ఆమె కూర్చున్నవైపు కారు అద్దం పగులగొట్టారు. సీటు బెల్ట్‌ను కట్ చేశారు. డ్రైవర్ సీటు గుండా ఆమెను బయటకు లాగారు. కాళ్లు చేతులు పట్టుకొని ఈడ్చుకెళుతూ తమ వాహనంలోకి ఎక్కించారు. డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఆసుపత్రికి వెళ్లాల్సి ఉందని, వదిలిపెట్టాలని రోదిస్తూ వేడుకున్నా కనికరించలేదు. కనీసం చికిత్స అందించే ఏర్పాటు కూడా చేయలేదు. దాంతో బాధితురాలు చాలాసేపు స్పృహ కోల్పోయారు. చివరకు ఆమెను ఆసుపత్రికి తరలించారు. తాను ఇప్పటికీ బతికి ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని అలియా రెహ్మాన చెప్పారు. ఒక జంతువును ఈడ్చుకెళ్లినట్లుగా తనను ఈడ్చుకెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. మిన్నెపొలిస్‌లో అక్రమ వలసదారులపై ఇమిగ్రేషన్ అధికా రులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. వారిని గుర్తించడానికి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను డిటెన్షన్ కేంద్రాలకు తరలించి ప్రశ్నిస్తున్నారు. మరోవైపు వలసదారులకు మద్దతుగా ఆందోళనలు జరుగుతున్నాయి.




# శబరిమల నుంచి వస్తుండగా కన్యాకుమారి వద్ద రోడ్డు ప్రమాదం

- తెలుగు దంపతుల మృతి
- మృతులు లక్సెట్టిపేటకు చెందిన సత్యనారాయణ, రమాదేవి



**కరీంనగర్, మహా :** తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) తమ ఊళ్లో కిరాణా షాపును నిర్వహిస్తున్నారు. ఈ దంపతులు అయ్యప్ప స్వామి మాల ధరించారు. ఈ నెల 8న ఓ ప్రైవేట్ బస్సులో శబరిమల దర్శనానికి వెళ్లారు. గురువారం మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో కన్యాకుమారి వద్ద బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం ముగించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా సత్యనారాయణ, రమాదేవిని ఓ ప్రైవేట్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలను పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ ఏడాది ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రాలివే..




సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ (ఐఎండీబీ).. ప్రతి ఏడాది మాదిరే ఈ సారి కూడా మోస్ట్ మోస్ట్ అవైటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాను ప్రకటించింది. 250 మిలియన్లకు పైగా ఐఎండీబీ కస్టమర్ల పేజ్ వ్యూస్ ఆధారంగా తీసిన ఈ లిస్ట్‌ను తాజాగా ప్రకటించింది. ఈ లిస్ట్‌లో టాప్ పొజిషన్‌లో షారుఖ్‌ఖాన్ కింగ్ సినిమా ఉండగా.. ప్రభాస్‌సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'స్పిరిట్' మూవీ నాలుగో స్థానం దక్కించుకుంది. అలాగే ప్రభాస్ మరో చిత్రం ఫౌజీ పదో స్థానంలో ఉంది. ఇక రామ్ చరణ్‌బుచ్చిబాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది 13వ స్థానం దక్కించుకుంది. మొత్తంగా టాప్ 20లో 5 తెలుగు సినిమాలు ఉండడం విశేషం.

## ఐఎండీబీ ప్రకటించిన టాప్ 20 సినిమాలివే...

**1) కింగ్ (హిందీ) :**

'పఠాన్' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ హీరోగా నటిస్తున్న చిత్రమింది. ఇందులో షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దీపికా పదుకొణె, రాణి ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్ లాంటి స్టార్స్ కూడా ఇందులో నటిస్తున్నారు.

**2) రామాయణ (హిందీ)**

రణ్‌బీర్ ప్రధాన పాత్రలో నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం రామాయణ. రెండు భాగాలుగా 'రామాయణ' రానున్న ఈ మూవీ మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.2027లో రెండో భాగం విడుదల కానుంది. ఇందులో రణ్‌బీర్ రాముడిగా నటించగా.. సాయి పల్లవి సీత పాత్రని పోషించింది. కన్నడ స్టార్ హీరో యశ్.. రావణుడిగా కనిపించబోతున్నాడు.

**3) జననాయగన్(తమిళ్)**

తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన చివరి చిత్రం జననాయగన్. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో పూజా హెగ్డే, మమితా బైజు, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషించారు.

**4) స్పిరిట్(తెలుగు)**

ప్రభాస్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటించగా,.బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు.. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

**5) టాక్సిక్(కన్నడ)**

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్. కియారా అద్వానీ, నయన తార, హూమా ఖురేషి, తారా సుతారియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 19న ఈ చిత్రం విడుదల కానుంది.

**6) బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్**

సల్మాన్‌ఖాన్ హీరోగా అపూర్వ లఖియా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. ఇందులో సల్మాన్ ఇండియన్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఆయనకు జోడీగా చిత్రాంగద సింగ్ నటిస్తోంది. హిమేష్ రేష్మియా సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**7) ఆల్ఫా(హిందీ)**

అలియా భట్. శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. యశ్‌రాజ్ ఫిల్మ్‌స్‌లో రాబోతున్న ఈ మొదటి మహిళా గూఢచారి చిత్రాన్ని శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు.

**8) దురంధర్ 2 (హిందీ)**

బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ దురంధర్ చిత్రానికి సీక్వెల్ ఇది. ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న విడుదల కానుంది.

**9) బోర్డర్ 2 (హిందీ)**

1997 నాటి ఐకానిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రమిది. ఈ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్‌జిత్ దోసాంజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

**10) ఫౌజీ**

హను రాఘవపూడి, ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతన్న చిత్రమిది. దేశభక్తి అంశాలతో ముడిపడి ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో నటిస్తున్నాడు. ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా.. జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

11) లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ(LIK) (తమిళ్) : ప్రదీప్ రంగనాథన్(హీరో)

12) ది ప్యారడైజ్ (తెలుగు) : నాని

13) పెద్ది (తెలుగు): రామ్ చరణ్

14) డ్రాగన్ (తెలుగు): ఎన్టీఆర్

15) లవ్ అండ్ వార్ (హిందీ): రన్‌బీర్ కపూర్

16) బూత్ బంగ్లా (హిందీ): అక్షయ్ కుమార్

17) బెంజ్ (తమిళ్): లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (LCU)నుంచి రాబోతున్న చిత్రమిది.

18) శక్తి శాలిని (హిందీ): హారర్‌కామెడీ ఫ్రాంచైజీ


19) 'పేట్రియాట్ (మలయాళం) మమ్ముట్టీ, మోహన్‌లాల్

20) ఓ రోమియో (హిందీ): షాహిద్ కపూర్



## సూపర్ హిట్ మూవీ సీక్వెల్...

ఆది హీరోగా వచ్చిన గతంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం మరగద నానయం. ఈ సినిమాకు ఏఆర్‌కే శరవణ్ దర్శకత్వం వహించారు. 2017లో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ మూవీని తెలుగులో మరకతమణి పేరుతో రిలీజ్ చేశారు. తాజాగా ఈ మూవీకి సీక్వెల్‌ను ప్రకటించారు. సంక్రాంతి కానుకగా ఈ విషయాన్ని రివీల్ చేశారు. ఈ కొత్త మూవీకి సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. పార్ట్-1లో నిక్కీ గల్రానీ హీరోయిన్‌గా నటించగా..ఇప్పుడు మాత్రం ప్రియా భవానీ శంకర్ కనిపించనుంది. ఈ చిత్రంలో సత్యరాజ్, నిక్కీ గల్రానీ, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ. అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ

భామ.. తమిళం, మలయాళంలోనూ నటించింది. ప్రస్తుతం బాలీవుడ్‌కు షిఫ్ట్ అయిన సాయిపల్లవి.. రామాయణతో పాటు ఏక్ దిన్ అనే మూవీలో కనిపించనుంది. ఈ సినిమాలో అమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాతోనే సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. తాజాగా సంక్రాంతి కానుకగా ఏక్ దిన్ మూవీకి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఏక్ దిన్ మూవీ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అయితే ఈ పోస్టర్ కాస్తా విమర్శలకు దారి తీసింది. ఇది చూస్తుంటే 2016లో వచ్చిన థాయ్ రొమాంటిక్ డ్రామా వన్ డేను పోలి ఉందని పలువురు సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఆ మూవీని కాపీ చేశారంటూ నెటిజన్లు విమర్శిస్తున్నారు. పేరుతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్ వరకూ అన్నీ ఒకేలా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు మేకర్స్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మరి ఈ చిత్రం రీమేక్ చేయనున్నారా? లేదా కొత్త స్టోరీనా అనేది క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే కాపీ కంటెంట్ అనే విమర్శలొస్తూనే ఉంటాయి. ఈ మూవీని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్నారు. సునీల్ పాండే దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రాన్ని సమ్మర్‌లో మే 1న రిలీజ్ చేయనున్నారు.

## త్వరలో ధనుశ్ -మృణాల్ పెళ్లి.. తేదీ కూడా ఫిక్స్..!

సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు. టాలీవుడ్ ఎంట్రీతోనే సూపర్ హిట్ కొట్టేసిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత వరుస సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం అడివి శేష్ హీరోగా వస్తోన్న డకాయిట్ చిత్రంలో మెప్పించనుంది. ఈ సినిమా సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సినీ కెరీర్ సంగతి పక్కన పెడితే.. మృణాల్ వ్యక్తిగత జీవితంపై గత కొన్ని నెలలుగా రూమర్స్ వస్తూనే ఉన్నాయి. ఆమె కోలీవుడ్ స్టార్ ధనుశ్‌తో డేటింగ్‌లో ఉన్నారని వార్తలొచ్చాయి. అయితే వీటిపై ఇద్దరు కూడా స్పందించలేదు. ఆ తర్వాత మృణాల్ ధనుష్ సిస్టర్స్ డాక్టర్ కార్తీక కృష్ణమూర్తి, విమల గీతలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో కావడంతో ఆ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. అంతేకాకుండా వారిద్దరు కూడా మృణాల్‌ను ఫాలో అయ్యారు. ఇక ఈ జంట డేటింగ్ కన్‌ఫామ్ అని చాలామంది ఫిక్సయిపోయారు. తాజాగా ఈ జంటపై మరో రూమర్ నెట్టింట వైరలవుతోంది. వీరిద్దరు త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని లేటేస్ట్ టాక్. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం వచ్చేనెల 14న మృణాల్ ధనుశ్ ఒక్కటి కాబోతున్నారని సోషల్ మీడియాలో వైరలవుతోంది. అయితే ఈ పెళ్లికి కేవలం అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు మాత్రమే హాజరు కానున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరు కూడా తమ పర్సనల్ లైఫ్‌లో ఎల్లప్పుడూ గోప్యతను పాటిస్తారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్తలపై మృణాల్ ఠాకూర్ కానీ, ధనుశ్ స్పందించలేదు. ఎవరో ఒకరు క్లారిటీ ఇస్తేనే ఈ రూమర్స్‌కు చెక్ పడనుంది. కాగా.. గతేడాది ఆగష్టు 1న మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుశ్ పాల్గొన్నారు. పార్టీ వీడియోలో ధనుష్ ఆమె చేతిని పట్టుకుని ఆత్మీయంగా మాట్లాడుతున్న దృశ్యం ఒకటి వైరలైంది. ఆపై మృణాల్ ఠాకూర్ నటించిన కొత్త సినిమా 'సన్ ఆఫ్ సర్దార్ 2' స్పెషల్ స్క్రీనింగ్‌కు ధనుష్ ప్రత్యేకంగా ముంబయికి వెళ్లారు. స్క్రీనింగ్ సమయంలో ధనుష్ చెవిలో మృణాల్ ఏదో గుసగుసలాడటం కనిపించింది. అంతకుముందు ధనుశ్ మూవీ 'తేరే ఇష్క్ మే' పార్టీకి మృణాల్ కూడా హాజరయ్యారు. అక్కడ కూడా వీరిద్దరూ కలిసి కనిపించారు. అప్పటి నుంచి వారిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వార్తలొచ్చాయి.





## మ్యూజిక్ డైరెక్టర్ టూ హీరో..

ఒక సినిమా హిట్ కావాలంటే కథతో పాటు బీజీఎం, నేపథ్య సంగీతం చాలా కీలకం. కథను మరింత ఇంట్రెస్టింగ్‌గా మార్చడంలో మ్యూజిక్ డైరెక్టర్ పాత్ర తప్పనిసరి. అందుకే స్టార్ హీరోల చిత్రాలకు సంగీత దర్శకుడు ఎవరనే దానిపై ఆడియన్స్‌లో ఆసక్తి ఉంటుంది. అలా టాలీవుడ్‌లో ఎస్ఎస్ తమన్, భీమ్స్ సిసిరోలియో, దేవీశ్రీ ప్రసాద్, అనూర్ రూబెన్స్, మిక్కీ జే మేయర్ లాంటి వాళ్లు ఉన్నారు. వీరి టాలెంట్‌పైనే సినిమా రిజల్ట్ కూడా ఆధారపడి ఉంటుంది. అలా తమ మ్యూజిక్ టాలెంట్‌తో అలరించిన సంగీత దర్శకులు ఆ తర్వాత హీరోలుగా కూడా ఎంట్రీ ఇచ్చేస్తున్నారు. తాజాగా మన టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ దేవీశ్రీ ప్రసాద్ ఎంట్రీ ఇస్తున్నారు. బలగం మూవీతో హిట్ కొట్టిన వేణు యెల్దండి డైరెక్షన్‌లో వస్తోన్న ఎల్లమ్మతో అరంగేట్రం చేస్తున్నారు. దీంతో ఈ సినిమాపై టాలీవుడ్ సినీ ప్రియుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మ్యూజిక్ డైరెక్టర్ టూ హీరోగా ఎవరెవరు ఎంట్రీ ఇచ్చారనే దానిపై నెట్టింట చర్చ మొదలైంది. అయితే ఈ లిస్ట్‌లో ఉన్నది ఎవరైనా ఆరా తీస్కే ఒకట్రెండు ప్రముఖుల పేర్లు మాత్రమే వినిపించాయి. అలా ఎంట్రీ ఇచ్చినవారిలో కోలీవుడ్ నుంచి విజయ్ ఆంటోనీ, జీవీ ప్రకాశ్ కుమార్ ఉన్నారు. వీరిద్దరు మాత్రమే మ్యూజిక్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి.. హీరోలుగా పలు సినిమాలు చేశారు. అయితే బ్లాక్ బస్టర్ హిట్స్ మాత్రం కొట్టకపోయినా.. ఓ మాదిరి చిత్రాలైతే చేశారు. ఒకరకంగా చూస్తే వీరిద్దరు హీరోలుగా అంతగా సక్సెస్ కాలేదనే చెప్పొచ్చు. విజయ్ ఆంటోనీ మాత్రం సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకని.. ఆ తరువాత నటుడిగా, నిర్మాతగా రాణించారు. ఇప్పుడు టాలీవుడ్ నుంచి దేవీశ్రీ ప్రసాద్ హీరోగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. తొలి సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతే కాకుండా బలగంతో హిట్ కొట్టిన వేణు యెల్దండి.. రెండో సినిమా కావడం మరింత ఆసక్తిని పెంచుతోంది. మరి మొదటి సినిమాతోనే దేవీశ్రీ ప్రసాద్ హిట్ కొడతాడా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే. అంతేకాకుండా కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ కూడా హీరోగా మారే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com